నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

8 | నిజామాబాద్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | KAMAREDDY


## రూ.కోట్లు కొల్లగొట్టి ఉడాయించిన వ్యాపారి

### లబోదిబోమంటున్న బాధితులు



మూసి ఉన్న సూపర్ మార్కెట్, గుమిగూడిన బాధితులు

కామారెడ్డి, ఫిబ్రవరి 8: రూ.కోట్లలో అప్పులు చేసిన ఓ వ్యాపారి బిచాణా ఎత్తేయడంతో కామారెడ్డిలో కలకలం రేగింది. బాధితుల కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో హబీబ్ అనే వ్యక్తి మెగా మార్ట్ సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కొంత మంది నుంచి భారీగా అప్పులు తీసుకున్నాడు. తెలిసిన వారి నుంచి నగదు, బంగారం రూపంలో రూ.2 కోట్లకు పైగా తీసుకున్నట్లు తెలిసింది. అలాగే, సూపర్ మార్కెట్‌కు వస్తువులు సరఫరా చేసే ఏజెన్సీలకు భారీగా బాకీ పడ్డాడు. ఈ క్రమంలోనే హబీబ్ ఉన్నట్టుండి మాయయ్యాడు. సుమారు 40 రోజులుగా దుకాణం మూసేసి ఉండడంతో అనుమానం వచ్చిన బాధితులు శనివారం ఒక్కొక్కరుగా సూపర్‌మార్కెట్ వద్దకు చేరుకున్నారు. షాపులో ఉన్న విలువైన సామగ్రిని హబీబ్ ముందే తరలించినట్లు గుర్తించారు. డిస్ట్రిబ్యూటర్లు వచ్చి అక్కడున్న కొందరు పెద్ద మనుషుల సాయంతో షాపులో మిగిలిన సామాన్లను తీసుకెళ్లారు. భారీగా డబ్బులు తీసుకుని పరారైన వ్యాపారిపై కొంద రు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరోవైపు, హబీబ్ ఐపీ పెట్టి పరారైనట్లు సమాచారం.

## భగ్గుమన్న మాలలు


జాన్కంపేట్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలలు

వేల్పూర్ ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా మాలలు భగ్గుమన్నారు. వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో మాల సంఘం ప్రతినిధులు శనివారం ఆందోళనకు దిగారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని వారు మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఎస్సీ వర్గీకరణకు ముందుకు రాలేదని, పాలన చేతకాని రేవంత్‌రెడ్డి ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్నదమ్ముళ్లలా కలిసి ఉన్న మాల, మాదిగలను విడదీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



**బడుగు, బలహీనవర్గాలను** కాంగ్రెస్ పార్టీ దారుణంగా మోసగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం బీసీ డిక్లరేషన్ సహా ఇతర హామీలను ప్రకటించిన హస్తం పార్టీ.. వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా బడుగులను దగా చేసింది. తాజాగా చేపట్టిన కుల గణన నివేదికను సైతం తప్పుల తడకగా ప్రకటించడం, రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం మీదకు నెట్టేయడంపై బీసీ వర్గాలు మండిపడుతున్నాయి. బలహీనవర్గాలకు ఏదో చేసినట్లు గొప్పలు చెప్పుకుంటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదేండ్ల క్రితమే రాష్ట్రంలో 50 శాతం బీసీల జనాభా ఉండగా, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నివేదికలో 46.25 శాతం ఉన్నట్లు ప్రకటించడం అనుమానాలకు తావిస్తున్నది. రిజర్వేషన్లు, అవకాశాలు లేకుండా చేసేందుకు కుట్రపూరితంగా రేవంత్ సర్కారు బీసీల జనాభా తగ్గించి చూపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

–ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 8

# బడుగులపై భస్మాసుర హస్తం

### వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ వెన్నుపోటు

- కుల గణన పేరిట మోసగించిన రేవంత్ సర్కారు
- జనాభా తక్కువగా చూపడంపై బీసీల ఆగ్రహం
- ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలం
- రిజర్వేషన్ల అమలుపైనా రేవంత్ మెలిక
- నిప్పులు చెరుగుతున్న బలహీనవర్గాలు
- బుద్ధి చెప్పేందుకు సిద్ధమైన బీసీలు

**కాంగ్రెస్ పార్టీ** గద్దెనెక్కేందుకు అనేక వక్రమార్గాలను ఎంచుకున్నది. రైతులు, బలహీనవర్గాలను టార్గెట్‌గా చేసుకుని అలవి కానీ హామీలు ఇచ్చింది. 2023 నవంబర్ 10వ తేదీన కామారెడ్డి గడ్డపై నిర్వహించిన బహిరంగ సభలో ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌లో అనేక హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ ముఖ్యులు ప్రకటించారు. తీరా అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా ఆ మాటను నిలబెట్టుకోలేదు. తాజాగా రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఓ తీర్మానం ప్రవేశపెట్టిన రేవంత్ సర్కారు.. కేంద్రానికి పంపిస్తున్నామని, అక్కడ ఆమోదిస్తేనే రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడంపై బీసీలు నిప్పులు చెరుగుతున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిందేమిటి.. ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నిస్తున్నారు. కనీసం మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లోనైనా జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించక పోవడంపై నిలదీస్తున్నారు.

### 'చేయి'చ్చిన కాంగ్రెస్

కామారెడ్డి గడ్డపై జరిగిన సభలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా వాటిలో ఏ ఒక్కటి అమలు చేయలేదు. బీసీ సబ్‌ప్లాన్ తెచ్చి, ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున, ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. కానీ గత బడ్జెట్‌లో ఆ మేరకు నిధులే కేటాయించలేదు. బీసీ కులాల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని, వడ్డీ రహిత రుణాలు ఇస్తామని, జిల్లాకో బీసీ భవన్, డిగ్రీ కాలేజీ, మండలానికో బీసీ గురుకులం ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పింది. చేతివృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తామని, మంగలి, చాకలి, కమ్మరి, కుమ్మరి, స్వర్ణకారులకు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి ఇస్తామని, 50 ఏండ్లు పైబడిన గీత కార్మికులు, చేనేతలకు పెన్షన్లు ఇస్తామని మోసం చేసింది.




### జనాభా తగ్గిపోవుడేంది?



కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ఎన్నికల ముందర బీసీల ఓట్ల కోసం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించింద్రు. గద్దెనెక్కాక డిక్లరేషన్ అమలును పక్కన పెట్టిండద్రు. రేవంత్‌రెడ్డి బీసీల గొంత కోసిండు. రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన ఆయన.. ఇప్పుడేమో కేంద్రం ఒప్పుకుంటేనే అని మెలిక పెట్టడం ద్వారా కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పేశారు. సర్వే వివరాలన్నీ తప్పుల తడకగా ఉన్నాయి. గతంలో 50 శాతం ఉన్న బీసీల సంఖ్య ఈ పదేండ్లలో ఎలా తగ్గిపోతుంది? బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాల్సి వస్తుందన్న భయంతోనే బడుగుల జనాభా తక్కువ ఉన్నట్లు చెబుతున్నారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలి.

**- మంజుల యాదవ్, అఖిల భారత యాదవ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు**

### బడుగులకు అన్యాయం చేయొద్దు..



దశాబ్దాలుగా వెనుకబడిన బీసీలను చిన్నచూపు చూడొద్దు. జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీలకు అవకాశం కల్పించాలి. ఇప్పటికే చాలా నష్టపోయాం. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పిస్తామంటే ఎంతో ఆశపడ్డాం. కానీ నిరాశే మిగిలేలా ఉన్నది. రాష్ట్ర జనాభా లో సగం కంటే ఎక్కువ మంది బీసీలే. కానీ సర్వేలో తగ్గినట్లు చూపించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయాలి.

**- మాడవేడి వినోద్‌కుమార్, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు**

### బీసీలంటే ఎందుకంత చిన్నచూపు..



వెనుకబడిన వర్గాలంటే కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి చిన్నచూపే. దశాబ్దాలుగా ఏలిన హస్తం పార్టీ బీసీలకు చేసిందేమీ లేదు. కాంగ్రెస్ పార్టీకి బీసీల ఓట్లు కావాలి కానీ, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి అక్కర్లేదు. బడుగులకు అండగా నిలబడింది ఒక్క కేసీఆరే. అనేక సంక్షేమ పథకాల అమలు, చేతివృత్తులకు చేయూతనిచ్చిన ఘనత బీఆర్ఎస్‌ది. ఎన్నికల ముందర ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ అలవికానీ హామీలు ఇచ్చింది. డిక్లరేషన్లు ప్రకటించింది. ఏ ఒక్కటీ అమలు చేయకుండా మరోమారు మోసగించింది. అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు బీసీలు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉన్నారు.

**- సిర్ప రాజు, బీసీ సంఘం నాయకుడు**

### దొంగ లెక్కలే..



పదేండ్ల క్రితం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 50 శాతం ఉన్నట్లు తేలింది. ఈ పదేండ్లలో వారి సంఖ్య మరింత పెరగాలే. కానీ కుల గణన సర్వేలో బీసీల జనాభా తగ్గినట్లు చూపించడం అనుమానాలకు తావిస్తున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నివేదికలో అన్ని దొంగ లెక్కలే చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న వెనుకబడిన వర్గాలు రాజకీయంగా ఎదుగుతారనే భయంతోనే రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్ని బీసీల సంఖ్య తక్కువ చేసి చూపిస్తున్నది. ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసగించింది. ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్ల అమలు కోసం జనం తిరగబడడం ఖాయం.

**- తెలంగాణ శంకర్, గాండ్ల సంఘం రాష్ట్ర నాయకుడు**

### అసంపూర్తిగా సర్వే..



కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరోమారు అన్యాయం చేస్తున్నది. కుల గణన చేసి చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో చెబితే నమ్మినం. వాళ్లను నమ్మినందుకు మమ్మల్ని మోసం జేసింద్రు. బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు. సర్వే జరిగిన తీరే అందుకు నిదర్శనం. కొన్ని ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లు అసలు ఇండ్లకే రాలేదు. అలాంటప్పుడు కుల గణన నివేదికు సరైన శాస్త్రీయత ఎక్కడ ఉంది. మళ్లీ సర్వే నిర్వహించి, బీసీలకు న్యాయం చేయాలి.

**- ఎనుగందుల మురళి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

# మంజీరాలో మారీచులు

- నదిని చెరబట్టి.. ఇసుక కొల్లగొట్టి..
- పరీవాహక ప్రాంతంలోదర్జాగా ఇసుక దందా
- అర్ధరాత్రి వేళ అక్రమంగా తవ్వకాలు
- వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- పోలీసుల ముందు నుంచే వాహనాల పరుగులు
- అక్రమార్కులతో పోలీసు, రెవెన్యూ అధికారుల కుమ్మక్కు?

**మంజీరా పరీవాహక** ప్రాంతంలో మారీచులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి వేళ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. నిత్యం వందలాది ట్రిప్పుల ఇసుకను తరలించుకు పోతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులను మచ్చిక చేసుకుని మంజీరా నదిలో ఇసుకను కొల్లగొడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల కళ్ల ముందు నుంచే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోక పోవడమే అందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు.

–బిచ్కుంద, ఫిబ్రవరి 8

**బిచ్కుంద** మండలంలోని ఖత్‌గావ్, హస్గుల్, పుల్కల్ గ్రామాల మంజీర పరీవాహక ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా ఇసుకను కొల్లగొడుతున్నారు. కొంత మంది ఇసుకాసురులు బిచ్కుంద మండల కేంద్రంతో పాటు పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాలకు పెద్ద ఎత్తున ఇసుక సరఫరా చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. జన సంచారం తక్కువగా ఉండే అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నది. హస్గుల్, శెట్లూర్, పుల్కల్ గ్రామాల్లో కొందరు ముఠాగా ఏర్పడ్డారు. పరీవాహక ప్రాంతంలో భారీగా పోగైన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి కొన్ని ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**వందలాది ట్రాక్టర్లు..**

ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేసేందుకు సబ్ కలెక్టర్ కిరణ్మయి అర్ధరాత్రి నిఘా పెట్టేందుకు వీఆర్ఏలతో నిఘా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అక్రమ రవాణా ఆగడం లేదు. ఒక్కో గ్రామంలో సుమారు 40 నుంచి 50 ట్రాక్టర్లు ఉన్నాయి. వాటి ద్వారా అర్ధ రాత్రి సమయంలో ఇసుకను తరలించుకు పోతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4–5వేలు, టిప్పర్‌కు రూ.65 వేల నుంచి రూ.70 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**తనిఖీలేవి?**


మంజీర నదిని చెరబట్టి ఇసుకను తోడేస్తున్న వారిని అడ్డుకోవాల్సిన యంత్రాంగం చేష్టలుడిగి చూస్తున్నది. నిరంతర నిఘా, తరచూ సోదాలు చేపట్టాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు వాటిని మరిచి పోయారు. ఎప్పుడైనా పత్రికల్లో వార్తలు వస్తే మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. ఒకటి, అరా ట్రాక్టర్‌ను పట్టుకుని, చిన్న మొత్తంలో జరిమానా విధించి, వాహనాలను వదిలేస్తున్నారని చెబుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటే తప్పితే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇసుక దందాను నియంత్రించాలని కోరుతున్నారు.

**అధికారుల సహకారం?**

గ్రామాల్లో ముఠాలుగా ఏర్పడిన ఇసుకాసురులు అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డు పడకుండా అధికారులను 'మేనేజ్' చేస్తున్నారు. మామూళ్లతో రెవెన్యూ, పోలీసు అధికారులను మచ్చిక చేసుకుని తమ దందాకు అడ్డు లేకుండా చూసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఎవరైనా ఇసుక దందాపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు, పోలీసులు అక్రమార్కులకు దగ్గరుండి సాయం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులు ఇసుక ట్రాక్టర్ల ముందర కాపలాగా వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.


బిచ్కుంద మండలకేంద్రంలో అర్ధరాత్రి పోలీసు వాహనం ముందు నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

### చర్యలు తీసుకుంటాం



బాన్సువాడ డివిజన్‌లోని మంజీర పరీవాహక ప్రాంతం లేదా వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకు పోతుంటే మాకు సమాచారం ఇవ్వాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అర్ధరాత్రి వేళ ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం లేదు.

**- కిరణ్మయి, బాన్సువాడ సబ్ కలెక్టర్**

### పొద్దు పూసే.. పుడమి మురిసే



కనుచూపు మేర పచ్చని పంట పొలాలు.. నడుమ నల్లతాచు లాంటి రహదారి.. ఆ పక్కనే పసుపు వర్ణంలో పొద్దుపొడుపు పంట.. కోటగిరి మండలం యాద్గార్‌పూర్ శివారులో ఈ సుందర దృశ్యం ఆకట్టుకుంటున్నది. చేను నిండుగా విరబూసిన పొద్దు పొడుపు, ఆ దారి వెంట వెళ్లే వారిని ఆకర్షిస్తున్నది.

– కోటగిరి, ఫిబ్రవరి 8

## ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

మాచారెడ్డి, ఫిబ్రవరి 8: ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. శనివారం మాచారెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బయల్దేరుతున్న ఓ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కామారెడ్డి డిపోకు చెందిన బస్సు భద్రాచలం బయల్దేరింది. మాచారెడ్డి బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని బయటికి వస్తుండగా, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం కిందపడి పోగా, వైర్లు నేలకొరిగాయి. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.